# రైతుల రుణ మాఫీ | వాగ్దానాలు - ఆచరణ

**పంజాబ్,** రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ రైతుల రుణమాఫీ వాగ్దానం ప్రకటన చేశాయి. ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత, రుణమాఫీ పథకాలను ఆయా ప్రభుత్వాలు చాలా అట్టహాసంగా ప్రారంభించాయి. ఈ పథకాలు క్షేత్రస్థాయికి ఎంతవరకు చేరాయి? వివిధ వార్తా నివేదికలనుండి సేకరించిన వివరాలను పరిశీలిస్తే, అమలుకాకుండా మిగిలిపోయినదెంతో వుందని వెల్లడవుతోంది.

పంజాబ్ రాష్ట్రంలో పరిస్థితి చూద్దాం. 2017 ఫిబ్రవరిలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలముందు కాంగ్రెస్‌పార్టీ రైతుల రుణమాఫీని వాగ్దానం చేయటంతోపాటు ఉచిత విద్యుత్తు కల్పిస్తామని ప్రకటించింది. ప్రభుత్వాన్ని ఏర్పరచినాక, చిన్న, సన్నకారు రైతులకు 2 లక్షల రూ॥లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. దీనివలన కేవలం 10 లక్షల 2వేల మంది రైతులు మాత్రమే రు. 9500 కోట్లమేర రుణమాఫీ పొందగలుగుతారు.

2018 మే చివరకు తమ లక్ష్యానికి కొంచెం హెచ్చుగా అనగా పదిశాతం ఎక్కువగా 2 లక్షల 2 వేల మంది రైతులకు 990 కోట్ల రూ॥ రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించారు. ఈ పథకం సుదీర్ఘ కాలపు కలగా మిగిలిపోనుంది. 2018-19 ఆర్థిక సం॥లో పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో మొత్తం పెట్టుబడి వ్యయం అంచనా 6,380 కోట్ల రూ॥ కాగా ప్రభుత్వం రుణమాఫీకి కేటాయింపులు 4,200 కోట్ల రూ॥లుగా వుంది. బడ్జెట్ పత్రాన్ని పరిశీలిస్తే రాష్ట్ర రుణభారం 21 లక్షల 10 వేల కోట్లు రూ॥ అంటే రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 40 శాతంగా వుంది. ఈ పరిస్థితి రుణమాఫీ క్రింద బడ్జెట్‌లో అత్యంత తక్కువ నిధుల కేటాయింపుకు మాత్రమే అవకాశం కల్పిస్తోంది.

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2017 జూన్‌లో రైతుల రుణమాఫీని ప్రకటించింది. 86లక్షల రైతులకు 36వేల కోట్ల రుణాలను మాఫీ చేయబోతున్నట్లు పేర్కొంది. 2017-18లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రుణమాఫీ క్రింద బడ్జెట్‌లో 24,000 కోట్ల రూ॥లను 2018 -19లో 31,600 కోట్ల రూ॥లను కేటాయించింది. 2018-19లో 36 లక్షలమంది రైతులకు చెందిన 22,000 కోట్ల రూ॥ రుణాలను పరిష్కరించినట్లుగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ సంవత్సరం 11 లక్షలమంది రైతులకు చెందిన 4వేల కోట్ల రూ॥ రుణాలను పరిష్కరించవచ్చు. దీనితో లబ్ధిదారులుగా పేర్కొన్నవారిలో సగభాగానికి మాత్రమే ఇప్పటికి రుణమాఫీ అందినట్లవుతోంది. దీనిలో వాస్తవానికి లబ్ధిదారులకు ఎంత చెల్లించారో తెలీదు.

"వాస్తవ లబ్ధిదారుల జాబితానే ప్రభుత్వం వద్ద లేనందువలన, ప్రభుత్వం రుణమాఫీ లబ్ధిదారులకు రుణమాఫీ చేయలేదు. రైతుల రుణమాఫీకి నిధుల కేటాయింపుకు వనరుల కొరత కారణంగా వుంది" అని లక్నో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఒకరు పేర్కొన్నారు. (బిజినెస్ స్టాండర్డ్ 23-5-18)

రాజస్థాన్ రాష్ట్రం రుణమాఫీని అత్యంత నిదానంగా అమలుచేస్తున్న వాటిలో మూడోదిగా వుంది. 2018 నవంబర్‌లో బిజెపి ప్రభుత్వం ఎన్నికలను ఎదుర్కోవలసి వుంది. 2018-19 బడ్జెట్‌లో రుణమాఫీ పద్దుక్రింద 2వేలకోట్ల రూ॥లను కేటాయించింది. 28 లక్షల మంది రైతులకు 50వేల కోట్ల రూ॥ల రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. అది ఇంకా ఇప్పటికీ రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలను తయారు చేయవలసే వుంది. ఈ రుణమాఫీ కూడా కేవలం సహకార సొసైటీలనుండి తీసుకున్న వాటికే వర్తిస్తుంది. 2016 - 17 సం॥లో రాజస్థాన్‌లో అందజేసిన వ్యవసాయ రుణం మొత్తం 76వేల 300 కోట్ల రూ॥లు. దీనిలో 5వ వంతు సహకార బ్యాంకులనుండి, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నుండి అందజేసింది.

మధ్యప్రదేశ్‌లో, గత సం॥ ప్రభుత్వం బలమైన రైతాంగ ఉద్యమాన్ని ఎదుర్కొంది. ఈ సందర్భంగా పోలీసు కాల్పులలో ఆరుగురు రైతులు మరణించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక తాయిలాలను ప్రకటించింది. వాటిల్లో పెద్దదేమంటే, కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరలపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌గా మరికొంత కలుపుతుందనేది. ఇదికూడా 2018-19 సీజన్‌లో ప్రకటించే ధరలకేగాక, 2017-18 సీజన్ నుండి అమలు చేస్తామని ప్రకటించింది. క్వింటాలు గోధుమలకు 200 రూ॥ చొప్పున 10 లక్షలమంది గోధుమ రైతులకు 1600 కోట్ల రూ॥ లబ్ధి చేకూరుస్తామని ప్రకటించింది. ఛత్తీస్‌ఘడ్‌లో కూడా ప్రభుత్వం క్వింటా ధాన్యం మద్దతుధరకు బోనస్‌గా 300 రూ॥ చెల్లిస్తామని ప్రకటించింది. ఇరు తెలుగు రాష్ట్రాలలోనూ రైతుల రుణమాఫీ అమలుతీరూ ఇలానే వుంది. గత నాలుగేళ్ళుగా రుణమాఫీ జరగకపోగా, రుణం తీర్చలేదనే కారణంగా సంస్థాగతంగా లభించే కనీసపాటి రుణం కూడా రైతులకు అందలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి బ్యాంకులలో ఉన్న రైతుల రుణాల మొత్తం రూ.87,612 కోట్లు. వీటి పరిశీలనకు వివిధ కమిటీల పేరుతో కాలయాపన చేసి రుణమాఫీ పరిమితిని రూ.50 వేలకు కుదించి, మాఫీ చేయాల్సిన రుణమొత్తాన్ని బాగా తగ్గించి వేశారు. 3వ విడత 3,600 కోట్ల రూ॥, 4వ విడత తాజాబడ్జెట్‌లో 4,100 కోట్ల రూ॥ కలిపినా, రుణమాఫీ కింద ఇప్పటికి కేటాయించిన మొత్తం 18,300 కోట్ల రూ॥ మాత్రమే. బ్యాంకు రుణాలపై రైతులు చెల్లించాల్సిన వడ్డీలో ఈ మొత్తం కేటాయింపు మూడోవంతు కూడా లేదు. కాగా, అసలు రుణం బ్యాంకులలో యధాతథంగా వుండటంతో, రుణాలు చెల్లించలేదనే పేరిట రైతులకు బ్యాంకులు తిరిగి రుణాలను ఇవ్వటానికి నిరాకరించాయి. కొద్దిమంది రైతులకైనా సంస్థాగతంగా లభించే ఈ కొద్దిపాటి రుణ సౌకర్యం కూడా లభించకుండాపోయింది. అంతేకాదు, రైతులు తమ సేద్యపు ఖర్చులకోసం అనివార్యంగా ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడి అధిక రుణభారంలో కూరుకుపోవటమే జరిగింది.

ప్రతి ఒక్కరూ గ్రామీణ సంక్షోభం, వ్యవసాయ రంగ సమస్యల గురించి మాట్లాడుతారు. అయితే ఎవరూ సమస్య మూల కారణాలలోకి వెళ్ళరు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలు – ముఖ్యంగా నూతన ఆర్థిక విధానాల ఫలితమే రైతాంగానికి వ్యవసాయాన్ని దండగగా చేస్తోన్నది. ఈ సంక్షోభం రుణభారాల రూపంలో వ్యక్తమౌతున్నది. కనుక ఈ విధానాలలో మార్పు లేకుండా, ఈ సంక్షోభ భారాలకు పైపూతలు పూయడానికి పాలకవర్గ పార్టీలు రైతాంగానికి అనేక తాయిలాలను ప్రకటిస్తున్నాయి. ఈ తాయిలాలు, చిట్కాలు ఏవీకూడా సంక్షోభాన్ని తొలగించకపోగా మరింత తీవ్రం చేస్తాయి.

సామ్రాజ్యవాదపు సేవలో తరిస్తున్న పాలకులు, ఆర్థిక మీటల ద్వారా రైతాంగాన్ని భూములనుండి తొలగించివేస్తూ, మరోవైపున రైతాంగ ఆగ్రహాన్ని ఉపశమింపజేయటానికి అనేక పథకాలను ప్రకటిస్తున్నారు. సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడి తోకగా భారత వ్యవసాయరంగాన్ని మలచటానికే ఇది ఉద్దేశించింది.

రైతాంగాన్ని ఉద్దేశపూరితంగా దివాలా తీయించే పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరాయ పోరాటం సాగించాలి. ఇది కేవలం రైతాంగ ప్రయోజనాలకోసమేగాక వ్యవసాయాన్ని తద్వారా దేశాన్ని, ప్రజలను మొత్తంగా సామ్రాజ్యవాద ఆధిపత్యం, దోపిడీల నుండి కాపాడేందుకు సాగించాలి.

ooooo

---

కార్మిక వర్గానికి ఒక రాజకీయ పార్టీ వుండాలి –అనే విషయాన్ని మార్క్సు ఎంత గట్టిగా చెపుతాడంటే, 'అది అత్యవసరం' అని చెపుతాడు. ట్రేడు యూనియన్లు, కార్మిక జనాభాని ఐక్యపరుస్తూ, వర్గ స్పృహను కలిగిస్తూ, పోరాటశక్తిని పెంచే సంస్థలు. కార్మికవర్గ రాజకీయ పార్టీ కూడా అటువంటిదే అయినా, అది ఒక వృత్తి సంఘం కాదు. అది, మొత్తం కార్మిక వర్గానికంతటికీ సంబంధించి, ఆ వర్గ ప్రయోజనాలకోసం రాజకీయంగా పోరాడే సంఘం. ఆ రాజకీయ పార్టీయే లేకపోతే కేవలం వృత్తి సంఘాల ద్వారా మాత్రమే కార్మికవర్గ రాజకీయ పోరాటాలు సాధ్యం కావు. అందుకే, కార్మికవర్గ పార్టీ పాత్రని మార్క్సు పదే పదే చెపుతాడు.

– సోలమన్ లొజోవ్‌స్కీ రాసిన
'కార్మికవర్గ పోరాటాలలో ట్రేడ్ యూనియన్‌ల పాత్ర' నుండి
2018 కార్ల్‌మార్క్సు శతజయంతి సంవత్సరం

❖❖❖

"కార్మికవర్గ సంపూర్ణ విముక్తికోసం, నేడు ట్రేడు యూనియన్లు, తమ తక్షణ కర్తవ్యాలతోపాటు, కార్మికవర్గాన్ని సంఘటిత పరచే కేంద్ర బిందువులుగా చైతన్యంతో ఎలా కృషిచేయాలో నేర్చుకొని తీరాలి. ఈ ధ్యేయంతో నిర్వహించబడే ప్రతి సాంఘిక, రాజకీయ ఉద్యమాన్నీ అవి బలపర్చాలి. యావత్తు కార్మికవర్గ ప్రతినిధిగా, అగ్రగామిగా, ముందు నిలిచి, యూనియన్లలో లేని కార్మికులను కూడా తమ చుట్టూ సమీకరించడంలో ట్రేడు యూనియన్‌లు కృతకృత్యం కావాలి.

❖❖❖

'బౌద్ధిక నాయకత్వం' అనే పాత్ర కూడా, అసాధారణ సూత్రీకరణే. ఏ బౌద్ధిక నాయకత్వ పాత్ర గురించి మార్క్సు చెప్పాడు? విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల నాయకత్వ పాత్రా? విజ్ఞానవేత్తల, ప్రొఫెసర్ల నాయకత్వ పాత్రా? – కాదు. ఇచట, 'బౌద్ధిక' అనగా, అది కమ్యూనిజానికి మారుపేరన్నమాట! కార్మికజనం, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నేర్చుకోవాలి. ఈ పదాలు, శ్రామిక సమూహాల లోతుల్లోకి చొచ్చుకుపోవాలనే ఉద్దేశ్యంతో, మార్క్సు, కావాలనే ఇట్టి అసాధారణ పదాలనూ, సూత్రీకరణలనూ ఉపయోగించాడు.

– సోలమన్ లొజోవ్‌స్కీ రాసిన
'కార్మికవర్గ పోరాటాలలో ట్రేడ్ యూనియన్‌ల పాత్ర' నుండి
2018 కార్ల్‌మార్క్సు శతజయంతి సంవత్సరం

❖❖❖